సాక్షి కామారెడ్డి

మంగళవారం । 16 । మే । 2023



సీఎం కప్ పోటీలు ప్రారంభం

సీఎం కప్ క్రీడా పోటీలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు.

- 9లో ▸



ధాన్యం తరలింపులో..

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపులో జాప్యం వద్దని రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.9 /29.5

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బెస్ట్ అవైలబుల్ స్కీం కోసం దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కింద 2023–24 విద్యా సంవత్సరానికి 3, 5, 8వ తరగతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ప్రవేశాలకు జిల్లాలోని అర్హులైన గిరిజనుల నుంచి జూన్ 2వ తేది వరకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం లభిస్తుందని, 3వ తరగతిలో 23 సీట్లు, 5, 8 తరగతిలో 11 సీట్ల చొప్పున సీట్లు ఉన్నాయని వీటిలో 33శాతం బాలికలకు రిజర్వు చేయబడతాయని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని 208 గదిలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

ఆహార దినుసుల సరఫరా కోసం వేలం



కామారెడ్డి టౌన్: తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల వసతి గృహాల్లో ఆహార దినుసుల సరఫరా కోసం బహిరంగ వేలం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో వసతి గృహాల్లో ఆహార దినుసులు సరఫరా చేయడానికి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం బహిరంగ వేలం చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి దయానంద్, మైనారిటీ కళాశాలలో ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.

స్త్రీనిధి అవకతవకలపై విచారణ పూర్తి



నాగిరెడ్డిపేట: మండలంలోని కిచ్చన్నపేట పరిధిలో గల మహిళాసంఘాల సభ్యులు చెల్లించిన రుణవాయిదాల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై విచారణ పూర్తయిందని డీపీఎం రవీందర్ రావు తెలిపారు. సోమవారం మహిళాసంఘాల నిర్వాహణకు సంబంధించిన రికార్డులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. గ్రామంలోని 21 సంఘాలకు సంబంధించిన రికార్డులను మూడు రోజులపాటు పరిశీలించామని, అందులో రూ. 1,56,864 పక్క దారి పట్టినట్లు గుర్తించామని చెప్పారు. గ్రామానికి చెందిన వీవోఏ లక్ష్మీనారాయణ, అప్పటి సీసీ బూస స్వామి నిర్లక్ష్యం కారణంగానే మహిళలు చెల్లించిన రుణవాయిదాల్లో అక్రమాలు చెప్పారు. విచారణకు సంబంధించిన నివేదికను డీఆర్డీవోకు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. రుణవాయిదాల చెల్లింపుల్లో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. మహిళలు చెల్లించిన డబ్బులపై ఆందోళన చెందవద్దని ఆయన పేర్కొన్నారు. విచారణలో స్త్రీనిధి రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా మేనేజర్ కిరణ్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం జగదీష్ కుమార్, సీసీలు రమేశ్, సుజాత పాల్గొన్నారు.

బీర్కూర్ ఎస్సైగా బాల్‌రెడ్డి



నస్రుల్లాబాద్ (బీర్కూర్): బీర్కూర్ మండల ఎస్సైగా బాల్ రెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఏడాదిన్నర కాలంగా బీర్కూర్‌కు ఎస్సై లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది లు పడడం గమనించి ఉన్నతాధికారులు ఎస్సై నియమించారు. ఈయన కామారెడ్డి స్పెషల్ బ్రాంచ్ నుంచి బదిలీపై వచ్చారు.

త్రీడీ పేరిట దగా!

- భూగర్భ జలాల సర్వే చేస్తామంటూ మోసం
- పక్కా రిపోర్ట్ అంటూ నమ్మిస్తున్న వైనం
- అడ్డగోలుగా డబ్బుల వసూలు
- బోర్లు వేసి నష్టపోతున్న రైతులు



కాలోజీవాడిలో బోర్ వేస్తున్న దృశ్యం

సాక్షి, కామారెడ్డి: తాడ్వాయి మండలం కాలోజీవాడికి చెందిన ఉపాధ్యాయుడు రామానుజన్‌రెడ్డి తన కిష్టమైన వ్యవసాయంపై మమకారంతో పండ్ల చెట్లు పెంచుతున్నాడు. తన పంట చేను ఎత్తయిన ప్రాంతంలో ఉండడంతో పాటు భూగర్భజలాల సమస్య తీవ్రంగా ఉంది. బోర్లు వేయించినా సరిగా నీళ్ల పడే పరిస్థితి లేదు. అప్పటికే నాలుగైదు బోర్లు తవ్వించాడు. ఒక బోరు కొద్దిగా పోస్తుంది. దాంతోనే మొక్కలు పెంచుతున్నాడు. త్రీడీ టెక్నాలజీతో బోర్ పాయింట్‌లు చూస్తామని యూట్యూబ్‌లో ఓ సంస్థ చేస్తున్న ప్రచారాన్ని చూసి వారిని ఆశ్రయించాడు. ఐదెకరాల భూమిలో సర్వే చేయడానికి రూ. 35వేలు తీసుకున్నారు. ఓ రోజు వచ్చి సర్వే చేసి రాత్రి వరకు రిజల్ట్ చెప్పారు. ఫలానా పాయింట్‌లో 400 అడుగుల లోతు వరకు బోరువేస్తే నీరు పుష్కలంగా వస్తుందని చెప్పారు. వాళ్లను నమ్మి నాలుగు వందల ఫీట్లు వేశాడు. చుక్కనీరు రాలేదు. ఫోన్‌చేస్తే ఇంకో వంద వేయమన్నారు. ఐదు వందలు వేశాడు.. ఇలా 8 వందల అడుగులు తవ్వించినా చుక్కనీరు రాలేదు. త్రీడీ సర్వే అంటే నమ్మి బోరు తవ్వించి రూ. 2లక్షలకు పైగా డబ్బులు ఖర్చు చేసి నష్టపోయాడు.

మెట్ట ప్రాంత రైతులు వర్షాధారం లేదంటే భూగర్భజలాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. బోర్లు తవ్వించేందుకు రైతులు భూగర్భంలో నీళ్ల జాడ కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. రైతుల అవసరం, అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని బోరు ఎక్కడ వేస్తే నీళ్లు పడతాయో చెబుతామంటూ వస్తుంటారు. అశాస్త్రీయ పద్ధతుల్లో అన్ని ప్రయత్నాలు చేసిన రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో చేసే సర్వేలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా 'త్రీడీ' టెక్నాలజీతో బోర్లకు సర్వే చేస్తామంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకోవడం, వాటిని చూసిన రైతులు వారిని ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసుకుని సర్వే చేస్తున్నారు. జిల్లాలోని కామారెడ్డి, తాడ్వాయి, మాచారెడ్డి, బీబీపేట, దోమకొండ, భిక్కనూరు, రాజంపేట, లింగంపేట, గాంధారి తదితర మండలాలకు ఎలాంటి సాగు నీటి ప్రాజెక్టులు లేవు. కేవలం భూగర్భజలాలు లేదంటే వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తారు. గత మూడు దశాబ్దాల కాలంగా జిల్లాలో రైతాంగం లక్షల సంఖ్యలో బోర్లు తవ్వించారు. కొందరు రైతులైతే పదుల సంఖ్యలో బోర్లు తవ్వించి అప్పులపాలయ్యారు. అప్పులతో ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలూ ఉన్నాయి. బోరు తవ్వితే ఎంతో కొంత నీరు పడుతుందని ఆశతో బోర్లు తవ్వించడం, నీరు పడకపోవడంతో ఆర్థికంగా నష్టపోవడం పరిపాటిగా మారింది.

సామాజిక మాధ్యమాల్లో ప్రచారం

బోర్లు తవ్వించి నష్టపోయిన రైతులు ఏది కొత్తగా వస్తే దానివైపు వెళ్తున్నారు. ఇటీవల త్రీడీ టెక్నాలజీతో బోర్ పాయింట్లు చూస్తారని తెలిసి వారిని ఆశ్రయించి సర్వే చేయిస్తున్నారు. రూ. 30 వేల నుంచి రూ.50 వేల వరకు డబ్బులు వసూలు చేసి సర్వేకు వస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన వాళ్లు సర్వే చేసి ఏదో ఒక రిపోర్టు చేతుల్లో పెడుతున్నారు. దాన్ని చూసి బోర్లు వేయిస్తే తడి కూడా రాలేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో పలువురు రైతులు త్రీడీ సర్వే చేయించి బోర్లు తవ్వి నష్టపోయినట్లు తెలుస్తోంది. ప్రైవేటు సంస్థలు చేస్తున్న ఈ మోసంతో రైతులు ఆర్థికంగా చితికిపోవాల్సి వస్తోంది. సర్వే కోసం రూ. వేలకు వేలు ఇవ్వడం, బోర్లు తవ్వడానికి అడ్డగోలుగా ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాము ఇచ్చే రిపోర్టు పక్కా అంటూ నమ్మించి మోసం చేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాల్లో ఎక్కడో సర్వే చేసి బోరు వేస్తే నీళ్లు పుష్కలంగా పడ్డాయంటూ వీడియోలు పెట్టి ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. వాటిని చూసి తాము వారిని ఆశ్రయించి నష్టపోయామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ అనుమతి ఉన్న వారితోనే సర్వే చేయించుకోవాలి

భూగర్భజలాల సర్వే కోసం ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన సర్టిఫికెట్లు ఉన్న వారితో సర్వే చేయించుకోవాలి. ఎవరో ఏదో చెబితే నమ్మి సర్వేకు అడ్డగోలుగా ఖర్చు చేసుకోవడం, బోర్ల తవ్వకానికి భారీగా ఖర్చు చేసి అనవసరంగా నష్టపోతున్నారు. ఎవరు పడితే వారిని నమ్మి మోసపోవద్దు. భూగర్భ జల శాఖ ద్వారా వాల్టా చట్టం ప్రకారం సర్వే చేయడం జరుగుతుంది. ఎవరైనా సర్వే చేయించుకోవాలనుకుంటే మీ సేవ ద్వారా గానీ, టీఎస్ ఐపాస్ పోర్టల్ ద్వారా గానీ రూ. వెయ్యి చెల్లిస్తే (మూడెకరాల భూమికి) సర్వే నిర్వహించి రిపోర్టు ఇవ్వడం జరుగుతుంది.

– సతీశ్‌యాదవ్, జిల్లా భూగర్భజల శాఖ అధికారి, కామారెడ్డి

రేషన్ డీలర్ల సమ్మెబాట!

- జూన్ 5వ తేదీ నుంచి..
- గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్
- నిలిచిపోనున్న బియ్యం పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న డీలర్

కామారెడ్డి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రేషన్ డీలర్లు సమ్మెబాట పట్టనున్నారు. జూన్ 5వ తేది నుంచి రేషన్ దుకాణాలు బంద్ చేసేందుకు రేషన్ డీలర్ల సంఘం నిర్ణయించింది. ఇప్పటికే డీలర్ల సంఘం నాయకులు గతనెల 20న పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు డిమాండ్ పత్రాన్ని అందజేశారు. సమ్మె నిబంధనల ప్రకారం సుమారు 45రోజుల ముందుగా కమిషనర్‌కు డిమాండ్ నోటీసు అందజేశారు. వాటిని నెరవేర్చని పక్షంలో డీలర్లు సమ్మెకు వెళ్లనున్నారు. కాగా డీలర్ల డిమాండ్ నోటీసుపై కమిషనర్ నేటికీ స్పందించకపోవడంతో సమ్మెకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రేషన్ డీలర్లు సమ్మెకు వెళ్తే పేదలకు బియ్యం పంపిణీ ప్రక్రియ ఆగిపోనుంది.

డీలర్ల ఆవేదన

జిల్లాలో 578 మంది డీలర్లు ఉన్నారు. గతంలో 9 రకాల సరుకులు పంపిణీ జరిగేది. ప్రస్తుతం కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. క్వింటాలుకు రూ. 70 కమీషన్ మాత్రమే చెల్లిస్తున్నారు. అందులో హమాలీ దిగుమతికి క్వింటాలుకు రూ. 10 పోను కేవలం రూ. 60 మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక షాపుకు 80 క్వింటాళ్లు కేటాయిస్తే దాంతో కమీషన్ రూ. 5,600 వస్తే అందులో ఇంటి అద్దె రూ. 3వేలు పోను హమాలీ చార్జీలు రూ. 800, డీలర్‌కు మిగిలేది. రూ. 2,300 కాగా దానిలో కరెంట్ బిల్లు లు ఇతరాత్ర పోను నెలకు రెండు వేలు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు వంద రూపాయలు రావడం లేదని పేర్కొంటున్నారు.

సమ్మెకు సిద్ధం

డీలర్ల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ముందుగా జూన్ నుంచి నిరవధికంగా షాపుల బంద్‌కు నిర్ణయం తీసుకున్నారు. జూన్ నుంచి సమ్మెకు వెళ్లడానికి సిద్ధమవుతున్నట్లు రేషన్ డీలర్ల సంఘం నాయకులు చెబుతున్నారు. పలు శాఖల సిబ్బంది సమ్మెతోపాటు డీలర్ల సమ్మె కూడా ప్రారంభమైతే ప్రజాపంపిణీ వ్యవస్థలో ఇబ్బందులు తలెత్తుతాయి. అయితే ఈ నెల 22న పౌరసరఫరాల శాఖ మంత్రి ఆధ్వర్యంలో డీలర్ల సంఘం నేతలతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. సమావేశంలో వారి సమస్యలకు పరిష్కారం లభించకపోతే సమ్మె అనివార్యం కావచ్చు.

జిల్లాలో 578 రేషన్ షాపులు

కామారెడ్డి జిల్లాలో 578 రేషన్ దుకాణాలు న్నాయి. వాటి పరిధిలో 2,53,773 ఆహార భద్రత కార్డులున్నాయి. ఇందులో 17,585 అంత్యోదయ, 9,890 అన్నపూర్ణ కార్డులున్నాయి. వీరికి 5,968 టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుంది. రేషన్ డీలర్లు సమ్మెకు వెళ్తే వలస కూలీలు ఇబ్బంది పడనున్నారు. ఉపాధి బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాల నుంచి చాలామంది వలస వెళ్తుంటారు. రేషన్ డీలర్లు సమ్మెకు వెళ్తే వీరంతా ఇబ్బంది పడనున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- రేషన్ డీలర్లకు ప్రధానంగా గౌరవ వేతనం అందజేయాలి.
- హెల్త్‌కార్డు, బియ్యం దిగుమతి హమాలీ చార్జీలు ప్రభుత్వమే భరించాలి.
- కరోనా సమయంలో మృతి చెందిన రేషన్ డీలర్ల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- కిలోకు 70 పైసల కమీషన్‌ను రూ. 2కి పెంచాలి.
- విద్యావంతులకు శాఖపరమైన సేవలో నియామకం చేయాలి.
- రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు ఇతరాత్ర సరుకులు పంపిణీ చేయాలి. మినీ సూపర్ మార్కెట్లుగా మార్చాలి.

“ రూ. 30వేలు ఇవ్వాలి



రేషన్ డీలర్లందరికీ ప్రతినెలా గౌరవవేతనం రూ. 30 వేలు చెల్లించాలి. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెలోకి దిగుతాం. దీంతోపాటు రేషన్ డీలర్లందరికీ హెల్త్‌కార్డులు జారీ చేయాలి. రేషన్ షాపులకు సంబంధించి శాశ్వత లైసెన్స్ ఇవ్వాలి. రేషన్ డీలర్లకు ఇచ్చే కమీషన్ పెంచాలి.

–గౌరిశెట్టి రాజు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి

పాలిసెట్‌కు పక్కాగా ఏర్పాట్లు చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష(పాలిసెట్)కు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ పరీక్ష బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఉంటుందని తెలిపారు. ఉదయం 9:30 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతి ఇస్తారని చెప్పారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్‌కే, సాందీపని, మంజీర డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 2,514 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. వీరిలో బాలికలు 1,202, బాలురు 1,312 మంది పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. విద్యార్థులు హాల్ టికెట్, హెచ్‌బీ పెన్సిల్, పెన్ను, ఎరేజర్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. 11 గంటల తర్వాత ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదని చెప్పారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, మద్నూర్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులకు సూచించారు. సమావేశంలో పాలిసెట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కిష్టయ్య, సంయుక్త సమన్వయకర్త శంకరయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు చంద్రకాంత్, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ సురేష్ గౌడ్, సాయిబాబా, డీఈవో రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎడతెగని లొల్లి..

- తెలంగాణ యూనివర్సిటీలో కొనసాగుతున్న గందరగోళం
- రిజిస్ట్రార్ గదికి తాళం వేయించిన వైస్ చాన్స్‌లర్ పీఏ
- వాకాటి కరుణ, నవీన్ మిట్టల్, ఈసీ సభ్యులకు ఫిర్యాదు చేసిన యాదగిరి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ వర్సిటీలో గందరగోళం ఎడతెగకుండా కొనసాగుతూనే ఉంది. వీసీ, పాలకమండలి సభ్యుల మధ్య నువ్వా నేనా అనేలా నడుస్తున్న లొల్లి ఎప్పటికప్పుడు సశేషంగానే ఉంటూ వస్తోంది. ఆర్థిక వ్యవహారాల నేపథ్యంలో రిజిస్ట్రార్ పదవి చుట్టూనే వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా సోమవారం రిజిస్ట్రార్ గదికి తాళం వేసి ఉంచడంతో వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఉదయం అన్ని విభాగాలు, చాంబర్లకు సెక్యూరిటీ సిబ్బంది తాళాలు తెరిచారు. రిజిస్ట్రార్ చాంబర్ తాళం తెరవద్దని వీసీ పీఏ సవిత చెప్పడంతో తెరవకుండానే ఉంచారు. దీంతో అక్కడకు వచ్చిన రిజిస్ట్రార్ వెనుతిరిగి వెళ్లి కామర్స్ విభాగంలో కూర్చున్నారు. విషయం ఈసీ సభ్యులకు చెప్పడంతో వారు వీసీకి ఫోన్ చేశారు. దీంతో మధ్యాహ్నం 1.30 గంటలకు తాళం తెరవాలని వీసీ పీఏ చెప్పడంతో సెక్యూరిటీ సిబ్బంది తాళం తీశారు. తాళం తెరిచాక రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది వెళ్లి కూర్చున్నారు. రిజిస్ట్రార్ మాత్రం చాంబర్‌కు రాలేదు. ఈ వ్యవహారంపై యాదగిరి ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణ, కమిషనర్ నవీన్ మిట్టల్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం, ఈసీ చెబితేనే రిజిస్ట్రార్‌గా వచ్చానని, సమస్య పరిష్కారం చేస్తేనే బాధ్యతలు స్వీకరిస్తానన్నారు. తనను లొంగదీసుకునే ఉద్దేశంతోనే వీసీ ఇలా చేశారని యాదగిరి ఆరోపించారు. తనకు రిజిస్ట్రార్ పదవిపై వ్యామోహం లేదన్నారు. గల్లీ పంచాయితీల మాదిరిగా గొడవలు పెట్టుకోవడం ఇష్టం లేదన్నారు. తనకు రిజిస్ట్రార్‌గా ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిందని.. వీసీ మాత్రం అది చెల్లదంటే ఎలా అన్నారు.

వీసీ రవీందర్‌గుప్తా 'సాక్షి'తో మాట్లాడుతూ తాను రిజిస్ట్రార్ గదికి తాళం వేయించలేదన్నారు. ఒకవేళ అలా చేయిస్తే సీల్ వేసి, లెటర్ విడుదల చేసేవాడినన్నారు. కాగా వీసీగా ఉన్న తన అనుమతి లేకుండానే ఈసీ సభ్యులు యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమించడం చెల్లదన్నారు. మహాత్మాగాంధీ వర్సిటీలో ఫిర్యాదులు ఉన్న యాదగిరిని నియమిస్తూ.. తాను లేకుండా ఎలా తీర్మానం చేస్తారన్నారు. తనను సీఎం సిఫారసుతోనే గవర్నర్ వీసీగా నియమించారన్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీలో తన అనుమతి లేకుండా అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ తదితర ఫైల్స్‌ను ఎవరికీ పంపొద్దని, ఫైనాన్స్ ఆఫీసర్ ద్వారా మాత్రమే తనకు ముందస్తు సమాచారం ఇచ్చి పంపాల్సి ఉంటుందని, వీసీ అన్ని విభాగాలకు సర్క్యులర్ జారీ చేశారు.

ఈసీ తీర్మానాల అమలేదీ..?

గత నెల 19న హైదరాబాద్‌లో నిర్వహించిన ఈసీ సమావేశం నుంచి వీసీ వాకౌట్ చేశారు. ఈ సమావేశానికి వాకాటి కరుణ చైర్మన్‌గా వ్యవహరించారు. తర్వాత వరుసగా గత నెల 26న, ఈ నెల5న, 12న జరిగిన ఈసీ సమావేశాలకు వీసీ హాజరు కాలేదు. ఈ మూడు సమావేశాలకు నవీన్ మిట్టల్ చైర్మన్‌గా వ్యవహరించారు. కాగా గతనెల 19న జరిగిన సమావేశంలో చేసిన తీర్మానాలకు సంబంధించి వీసీ హైకోర్టు స్టే తెచ్చారు. మిగిలిన మూడు సమావేశాల్లో చేసిన తీర్మానాలను సైతం అమలు చేయించలేని పరిస్థితి నెలకొంది. నలుగురు ప్రొఫెసర్ల సర్వీసు పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి టాంపరింగ్ చేసిన కనకయ్యపై క్రిమినల్ కేసుపెట్టాలనే తీర్మానం, విద్యావర్ధినిని సస్పెండ్ చేసే తీర్మానం, వీసీ అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సీపీతో విచారణ చేయించే తీర్మానాలు అమలుకు నోచుకోవడం లేదు. 25 రోజులు గడిచి నప్పటికీ రిజిస్ట్రార్ యాదగిరి తీర్మానాల అమలుకు పూనుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

గవర్నర్‌కు బీజేపీ ఫిర్యాదు

టీయూలో అక్రమాలపై, గందరగోళ వ్యవహారాలపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కులాచారి దినేష్‌కుమార్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కారణంగానే ప్రస్తుత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని వీసీ రవీందర్ అంటున్నారన్నారు. వీసీ దొంగ అని నవీన్‌మిట్టల్, నవీన్ మిట్టల్ దొంగ అని వీసీ అంటున్నారన్నారు. తాను రూ. 3 కోట్లు ఇచ్చి వీసీగా వచ్చినట్లు రవీందర్ చెబుతున్నారంటే కేసీఆర్ ప్రభుత్వం అవినీతి ఏమిటో తెలుస్తోందన్నారు. వీసీ అవినీతిపరుడని మిట్టల్ చెబుతుంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదన్నారు. వీసీ అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

తరుగును ప్రశ్నించిన రైతులపై దాడి



దాడిలో గాయపడిన రైతు రాంరెడ్డి

నిజాంసాగర్(జుక్కల్): ధాన్యం కొనుగోలులో తరుగును ప్రశ్నించిన ఓ గ్రామ సర్పంచ్‌తో పాటు ఇద్దరు రైతులపై రైస్‌మిల్లు నిర్వాహకులు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలో చేటు చేసుకుంది. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావ్ పల్లి గ్రామంలో అచ్చంపేట సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రం నుంచి పిట్లం మండలంలోని కుర్తి గ్రామశివారులో ఉన్న వైష్ణవి రైస్ మిల్లుకు నాలుగు రోజుల క్రితం లారీని పంపించారు. లారీని డ్రైవర్ గేటు బయట పెట్టి వెళ్లాడు. మూడు రోజుల వరకు అన్‌లోడ్ చేయలేదు. తర్వాత లారీలో 761 బస్తాలు తరలిస్తే 57 బస్తాలను తరుగు పేరిట మిల్లు యజమానులు కోత విధించారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సాయిలుతో పాటు ముగ్గురు రైతులు రైస్ మిల్లుకు వెళ్లారు. 57 బస్తాల కోత విషయమై రైస్ మిల్లు నిర్వాహకులను, యజమానులను నిలదీశారు. ఈ విషయమై మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసినట్లు తెలిసింది. ఆగ్రహించిన రైస్‌మిల్లు యజమానిని రాంరెడ్డి అనే రైతు అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో రైస్ మిల్లు నిర్వాహకులు రైతు రాంరెడ్డిపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. రాజిరెడ్డి అనే మరో రైతుపైనా దాడి చేశారు.

రైతులపై దాడి చేస్తున్న రైస్ మిల్లు నిర్వాహకులను నిలువరించే ప్రయత్నం చేసిన సర్పంచ్ సాయిలను దూషించడంతో పాటు బయటకు గెంటి వేసినట్లు తెలిసింది. తర్వాత సర్పంచ్ గాయపడిన రైతు రాంరెడ్డిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. రైతులపై దాడి సంఘటనను పలువురు నిరసిస్తున్నారు.

5,114 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 5,114 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన 408 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 4,08,383 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 60,247 మందికి కంటి అద్దాలను అందజేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 81.37శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు.

కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ బదిలీ

- ఇన్‌చార్జిగా నిజామాబాద్ రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన శ్రీలత బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జిగా నిజామాబాద్ సబ్ రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ వచ్చారు. ఆయన సోమవారం బాధ్యతలను తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీలత ఎన్నో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీంతో ఆమెపై వేటు పడింది. ఆమె అవినీతిపై సీఎం వరకు ఫిర్యాదులు వెళ్లాయి. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్‌తో పాటు డాక్యుమెంట్ రైటర్లు ఆందోళనలు చేశారు. దీంతో ఆమెను నిజామాబాద్ ఆడిట్ అధికారిణిగా బదిలీ చేశారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో పురుషులకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి ఎలక్ట్రిషియన్ (హౌస్‌వైరింగ్, 30 రోజులు)కోర్సులో, ఈ నెల 19 నుంచి సీసీటీవీ (13రోజులు) కోర్సులో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందిస్తామని తెలిపారు. 19 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ వెంట ఆధార్‌కార్డు, రేషన్ కార్డ్, ఎస్సెస్సీ ధ్రువీకరణ పత్రం, 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని వచ్చి సంస్థ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 08461 222428, 08461 295428 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేపు మెడికల్ క్యాంపు

నిజామాబాద్ సిటీ: నగరంలోని హరిచరణ్ మార్వాడి స్కూల్లో యంగ్ ఇండియా మిషన్(కరీంనగర్), ద్రోణాచార్య డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెడికల్ క్యాంపు, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవగాహన సదస్సు జరుగుతుందని, దేశానికి సర్వీస్ చేయాలనుకునే యువత ఇండియన్ ఆర్మీ నేవి ఎయిర్‌ఫోర్స్‌లో ఈ ఉద్యోగం చేయాలనుకున్న అభ్యర్థులకు ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

19న జిల్లా స్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న శుక్రవారం ఉదయం 8గంటలకు స్థానిక ఇందిరా గాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వంద, 200, 400, 800, 1500, 3వేలు, 5వేల మీటర్ల పరుగుతో పాటు లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జవెలిన్‌త్రో అంశాలుంటాయన్నారు. 18ఏళ్లు పైబడిన వారు పాల్గొనవచ్చన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి


సాయాగౌడ్

బాన్సువాడ: బాన్సువాడకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ సాయాగౌడ్(54) సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. బాన్సువాడ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న సాయాగౌడ్‌కు 6 నెలల కిత్రం గుండెకు సర్జరీ జరిగింది. అప్పటి నుంచి విధులకు సెలవు పెట్టి ఇంటి వద్దనే ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి వ ద్ద గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికి సాయాగౌడ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సాయాగౌడ్ మృతి పట్ల బాన్సువాడ డీఎం సాదాశివ్ సంతాపం తెలిపారు.

వినతులను పరిష్కరించాలి



నిజామాబాద్‌లో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్ కామారెడ్డిలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్

ఖలీల్‌వాడి: ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 41 వినతులు అందాయి. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, నిజామాబాద్ ఆర్డీవో రవి వినతులు స్వీకరించారు.

పట్టా ల్యాండ్ అసైన్‌మెంట్‌గా వచ్చింది

పట్టా ల్యాండ్ అసైన్‌మెంట్ ల్యాండ్‌గా వచ్చిందని డిచ్‌పల్లి మండలం యానంపల్లి గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి నాలుగేళ్లుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారు. సోమవారం కూడా అదనపు కలెక్టర్‌కు అర్జీ అందించారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

పన్ను మినహాయింపు ఇవ్వాలని వినతి

2001లో గుజరాత్ భూకంపం వచ్చినప్పుడు బీడీ కంపెనీ యాజమాన్యాలు బీడీ కంపెనీలో పని చేసిన వారి నుంచి రూ.50 లక్షలు వసూలు చేసినట్లు ట్రేడ్ యూనియన్ నేతలు తెలిపారు. వీటిని గుజరాత్‌కు పంపించకపోవడంతో కార్మిక సంఘాలు పోరాటం చేస్తే రూ.50 లక్షలు బ్యాంక్‌లో డిపాజిట్ చేసినట్లు చెప్పారు. ఇప్పుడు రూ.కోటిన్నర వరకు జమ కావడంతో పన్ను చెల్లించాలని నోటీసులు అందించినట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. వాటికి పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. సిద్ధిరాములు, ఏఎస్ పోశెట్టి, బాలరాజు, స్వామి, వెంకట్ తెలిపారు.

బహిష్కరణపై ఫిర్యాదు

వేల్పూర్ మండలం ఆమీనాపూర్ గ్రామంలో వీడీసీ తమను సాంఘిక బహిష్కరణ చేసినట్లు మంద రాజన్న కుటుంబసభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వీడీసీలో జరిగిన మీటింగ్‌లో రిపోర్టర్‌గా ఫొటోలు తీసినందుకు గ్రామ బహిష్కరణ చేసినట్లు ఆరోపించారు.తనకు న్యాయం చేయాలని కోరారు.

కామారెడ్డిలో 44 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 44 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను ఆన్లైన్లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీపీవో శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యాసిడ్ బాటిల్‌తో ప్రజావాణికి..

కామారెడ్డి క్రైం: డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని యాసిడ్ బాటిల్ వెంట తీసుకుని వచ్చి ఆందోళన చేసేందుకు యత్నించింది ఓ మహిళ. న్యాయం చేయకపోతే యాసిడ్ తాగి చనిపోతానని ఆమె అనడం ప్రజావాణిలో కలకలం రేపింది. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉండే షబానాకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇస్లాంపూర కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటుంది. సొంత ఇల్లు లేకపోవడం, ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండడంతో డబుల్‌బెడ్‌రూం ఇల్లు కోసం చాలా రోజుల క్రితమే దరఖాస్తు చేసుకుంది. ఇటీవల తీసిన డ్రాలో ఆమెకు డబుల్ బెడ్‌రూం రాలేదు. దీంతో సోమవారం యాసిడ్ బాటిల్‌ను సంచిలో పెట్టుకుని ప్రజావాణికి వచ్చింది. ఫిర్యాదుదారులతో కలిసి క్యూలో నిలబడింది. అక్కడే ఉన్న పోలీసులకు అనుమానం వచ్చి సంచిలో ఏముందని చూశారు. యాసిడ్ బాటిల్‌ను లాక్కున్నారు. ఎందుకు తీసుకువచ్చావని షబానాను ప్రశ్నించారు. అధికారులు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని, లేకపోతే యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకునేందుకు తెచ్చానని చెప్పింది. పోలీసులు, అధికారులు ఆమెను పక్కాకు తీసుకువెళ్లి సముదాయించారు. అనంతరం ఇంటికి పంపించారు.


షబానా డబుల్ బెడ్‌రూం ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న రశీదు

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి


లింగంపేటలో వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి రూరల్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం కామారెడ్డి మండలం గర్గుల్‌లో సీఎం కప్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామీణ క్రీడాకారులను ప్రొత్సహించేందుకు సీఎం కప్ పోటీలను నిర్వహిస్తుందని, దీనివల్ల గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయవచ్చన్నారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల వల్ల మానసికోల్లాసంతో పాటు శారీరక దేహదారుఢ్యం కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. క్రీడల్లో చిన్న మల్లారెడ్డి, ఇస్రోజీవాడి, క్యాసంపల్లి తండా, నర్సన్నపల్లి గ్రామాలకు చెందిన క్రీడాకారుల జట్లు పాల్గొన్నారు. కబడ్డీలో చిన్నమల్లారెడ్డి ప్రథమ, నర్సన్నపల్లి ద్వితీయ స్థానాలు గెలుపొందాయి. కార్యక్రమంలో సర్పంచ్‌లు చింతల రవితేజగౌడ్, ద్యాప హన్మాండ్లు, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో మలహరి, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, పీఈటీలు మధుసూదన్‌రెడ్డి, స్వామిగౌడ్, ఆంజనేయులు, మోహన్‌రెడ్డి, సంజీవులు, సతీశ్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

లింగంపేట: యువత క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకు రావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకాంక్షించారు. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. నిరంతరం సాధన చేయాలన్నారు. మండల స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 22 నుంచి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో తలపడడానికి వాలీబాల్ 18 జట్లు, ఖో-ఖో 10 జట్లు, కబడ్డీ 18 జట్లు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. మూడు రోజుల పాటు ఈ క్రీడలు నిర్వహిస్తామన్నారు. అలాగే ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నిసాబేగం, జెడ్పీటీసీ శ్రీలత, సర్పంచ్ బొల్లు లావణ్య, ఎంపీటీసీ శమీమున్నిసాబేగం, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈవో రామస్వామి, తహసీల్దార్ రాజేశ్వర్, హెచ్‌ఎం వహీద్‌సిద్దిఖీ, ఎంపీవో ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం


భారతి విద్యాలయం 1995-96 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు

మోర్తాడ్: మోర్తాడ్‌లోని భారతీ విద్యాలయంలో 1995–96 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చాలా సంవత్సరాల తరువాత కలుసుకున్న స్నేహితులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.

ధాన్యం తరలింపులో జాప్యం వద్దు

- రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్

నిజాంసాగర్(జుక్కల్): రైతుల నుంచి కొనుగోలు చేసిన వరిధాన్యం బస్తాలను వెనువెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, మిల్లు ట్యాగింగ్ విషయంలో ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ అధికారులకు సూచించారు. సోమవారం నిజాంసాగర్ మండలం మంగ్లూర్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, వెల్గనూర్ శివారులోని ఖేతకి రైస్‌మిల్లును తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం తుకాలు, ధాన్యం బస్తాల తరలింపుపై, రైస్‌మిల్లులో బియ్యం నిల్వలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణతో పాటు బస్తాల తరలింపును వేగవంతం చేయాలన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైస్‌మిల్లుల్లో తరుగు పేరిట వ్యాపారులు రైతులను ఇబ్బందులు పెడుతున్నట్లు ఫిర్యాదు వస్తున్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, జిల్లా సహకార అధికారి వసంత, డీఎం అభిషేక్, సొసైటీ సీఈవో సంగమేశ్వర్‌గౌడ్, ఖేతకి రైస్‌మిల్లు నిర్వాహకులు రాములు, లక్ష్మణ్, ప్రసాద్ తదితరులున్నారు.


రైస్‌మిల్లులో బియ్యం పరిశీలిస్తున్న రవీందర్

ఖతార్‌లో తాళ్లరామడుగు యువకుడి దుర్మరణం


సయ్యద్ సద్దాం (ఫైల్)

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు గ్రామానికి చెందిన సయ్యద్ సద్దాం(25) ఖతార్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రా మస్తులు సోమవారం తెలిపారు. సద్దాం 10 నెలల క్రితం ఉపాధి కోసం ఖతార్ వెళ్లాడు అక్కడ ఒక కంపెనీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. లగేజీని డెలివరీ చేయడానికి వెళ్తుండగా అతను నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో సద్దాం అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

మాక్లూర్: మండలంలోని చిక్లీ శివారులో పేకాట స్థావరంపై సోమవారం సాయంత్రం దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. వారి నుంచి రూ.5,200 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఆస్తి కోసం తండ్రిని చంపిన కొడుకు


తుకారాం (ఫైల్)

ఎల్లారెడ్డి: ఆస్తి కోసం కన్న తండ్రిని కొడుకు కడతేర్చిన ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన జాడె తుకారాం (74) బట్టల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. తుకారాంకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు కిశోర్ అలియాస్ బాలకృష్ణ ఉన్నాడు. నలుగురి వివాహాలయ్యాయి. కిశోర్ వ్యాపారం చేసుకుంటానని తండ్రి నుంచి ఆస్తి తీసుకుని 20 ఏళ్ల క్రితం హైద్రాబాద్‌కు వెళ్లిపోయాడు. వ్యాపారంలో దివాళా తీయడంతో అప్పులు పెరిగి పోయి రెండేళ్ల క్రితం ఎల్లారెడ్డికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అప్పటి నుంచి కిశోర్ తండ్రితో ఇంటిని అమ్మి డబ్బులు ఇవ్వాలని, అప్పులు ఎక్కువ అయ్యాయని తరుచూ గొడవ పడేవాడు. బంధువులు, కుల సంఘం వాళ్లు ఇంటిని అమ్మేది లేదని తండ్రి తదనంతరం ఇంటిని అమ్మాలని చెప్పారు. దీంతో కిశోర్ ఆదివారం ఉదయం తండ్రి ఉంటున్న ఇంటికి వచ్చి డబ్బులను కావాలని అడిగాడు. తండ్రి నిరాకరించడంతో అతడి కాళ్లు చేతులను బెడ్ షీట్‌తో కట్టేసి తలను నేలకేసి బాదడంతో తీవ్ర గాయాలై తుకారాం మృతి చెందాడు. తండ్రి మృతి చెందిన విషయాన్ని గ్రహించిన కిశోర్ కాళ్లకు, చేతులకు కట్టేసిన బెడ్ షీట్‌ను ఇంటిలోపల ఉండే గ్యాస్ పొయ్యిపై తగలబెట్టాడు. తలకు అయిన గాయాలను బట్టతో తుడిచి బయటకు వచ్చి తండ్రికి గుండె పోటు వచ్చిందని స్థానికులను నమ్మించే ప్రయత్నం చేశాడు. కాగా స్థానికులు ఆదివారం ఉదయం ఇంటిలో జరిగిన గొడవ గురించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు జాగిలాలను, క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. మృతుడి కూతురు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రాష్ట్రీయ జిల్లా పంచాయతీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విఠల్‌రావు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రీయ జిల్లా పంచాయతీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ ఉపాధ్యక్షులుగా జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు నియమక పత్రాన్ని జాతీయ జిల్లా పంచాయతీ సంఘం వ్యవస్థాపక చైర్మన్ కైలాస్ గోర్ పాటిల్ అందజేశారు. సోమవారం జిల్లా పరిషత్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. ఇటీవల జాతీయస్థాయిలో సంఘం ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు. విఠల్‌రావు జాతీయస్థాయి సంఘం ఉపాధ్యక్షులుగా కొనసాగుతూ, రాష్ట్ర అధ్యక్షులుగా వ్యవహారించనున్నట్లు తెలిపారు. త్వరలోనే రాష్ట్రస్థాయిలో 8మందితో కమిటీ ఏర్పాటు చేస్తామని, ప్రధాన కార్యదర్శితో పాటు, ఉపాధ్యక్షులు, మహిళ అధ్యక్షులు ఉంటారన్నారు. కేంద్ర నిధుల గురించి పోరాటాలు చేస్తామన్నారు.


దాదన్నగారి విఠల్‌రావు

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి వెంకటేష్ ధ్రువ సోమవారం తీర్పునిచ్చారు. రెండు రోజుల క్రితం కామారెడ్డి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నిజాంసాగర్ మండలం మహమ్మద్ నగర్ గ్రామానికి చెందిన యాదగిరి మద్యం తాగి బైక్ నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని సోమవారం కోర్టులో హాజరపరచగా రెండు రోజులు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వని యజమాని


శబరి(ఫైల్)

నందిపేట: క్యాన్సర్‌తో మహిళ చనిపోతే ఆమె మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వలేదు యజమాని. ఈ అమానవీయ ఘటన నందిపేటలో చోటు చేసుకుంది. వివరాలు.. మండల కేంద్రంలో శ్రీసిద్ధివినాయక ఆస్పత్రిలో పది సంవత్సరాల నుంచి సేవలందిస్తున్న డాక్టర్ శబరి(60) ఆదివారం రాత్రి క్యాన్సర్‌తో మృతి చెందారు. డాక్టర్‌ది కరీంనగర్ కాగా భర్త కుమారుడితో గత పదేళ్లుగా నందిపేటలోనే నివసిస్తున్నారు. భర్త చనిపోవడంతో కుమారుడితో రాంనగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆమె డాక్టర్‌గా పని చేస్తుండగా, కుమారుడు డీజే మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆమె చనిపోవడంతో నందిపేటలోనే కర్మకాండ చేయడానికి సిద్ధమయ్యారు. కానీ ఇంటి యజమాని శబరి మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పలువురితో చెప్పించినా ఇంటి యజమాని ససేమిరా అన్నారు. దీంతో పక్కనే నివాసం ఉంటున్న లాయర్ దేవన్న తన ఇంటిని కర్మకాండలు అయిపోయేవరకు వాడుకోవాలని మానవత్వాన్ని చాటుకున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి



నిజాంసాగర్: జుక్కల్ మండలం డోన్‌గాం శివారులోని సోమ వారం సాయంత్రం బైక్ అదుపు తప్పి బాబురావు(48) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా టేగంపూర్ గ్రామానికి చెందిన బాబురావు జుక్కల్ మండలంలోని పడంపల్లి గ్రామంలో సోమవారం జరిగిన వివాహానికి హాజరయ్యాడు. సాయంత్రం వేళ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా డోన్‌గావ్ శివారులో మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి కిందకు దూకుసుకుపోవడంతో తీవ్రంగా గాయపడ్డ బాబురావు అక్కడికక్కడే మృతి చెందాడు.

లారీని ఢీకొని ఒకరు..



బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన బాన్సువాడ సాయిలు(37)ఆదివారం రాత్రి బుడ్మి శివారులోని మంజీర బ్రిడ్జి వద్ద లారీని వెనక నుంచి ఢీకొని మృతి చెందాడు. వివరాలు.. ఆదివారం రాత్రి పిట్లంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు సాయిలు బైక్‌పై వెళ్లాడు. బయలు దేరిన గంటలోపే రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం అందిందని మృతుడి భార్య అనిత పేర్కొన్నారు. రోడ్డుపై పార్కింగ్ లైట్లు వేయకుండా, ఎలాంటి రేడియం స్టిక్కర్లు వేయకుండా అజాగ్రత్తగా లారీని నిలపడంతోనే తన భర్త లారీని ఢీకొన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని ఒకరు..

దోమకొండ: మండలంలోని లింగుపల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి బైక్‌ను కారు వెనుకనుంచి ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న బీహర్ రాష్ట్రానికి చెందిన సంజీవ్‌కుమార్ మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన లచ్చుగారి శ్రీరాం లింగుపల్లి నుంచి సంజీవ్‌కుమార్‌తో కలిసి బైక్‌పై దోమకొండకు వస్తున్నాడు. వీరి బైక్‌ను వెనక నుంచి కారు ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సంజీవ్‌కుమార్ మృతిచెందాడు. శ్రీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

చెరువులో పడి ఒకరు..

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బోయినివాని కిషన్(40) నడిపల్లి రాజేశ్వర్ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కిషన్ స్థానిక హోటల్‌లో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. చేపల వేటకు వెళ్లి తిరిగి రాలేదని, కిషన్ మృతదేహం స్థానిక నడిపల్లి రాజేశ్వర్ చెరువులో కనిపించిందని పేర్కొన్నారు. మృతుడి భార్య గోదావరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దోమకొండ: అప్పుల బాధతో రైతు బైకరి బీరయ్య(35) ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమకొండ మండలం అంచనూరు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. అంచనూరు గ్రామానికి చెందిన బీరయ్యకు గ్రామ శివారులో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దాంట్లో వానాకాలంలో పత్తి పంట సాగు చేశాడు. పంట సాగు కోసం పెట్టుబడులకు అప్పులు తీసుకువచ్చాడు. కానీ దిగుబడి రాక నష్టం వచ్చింది. దీనికి తోడు ఇటీవల 50 గొర్రెలను కొనుగోలు చేశాడు. పంట పెట్టుబడికి, గొర్రెల కొనుగోలుకు దాదాపు రూ.ఐదు లక్షల వరకు అప్పు చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పంట దిగుబడి లేక గొర్రెలను కూడా ఇటీవల అమ్మేశాడు. అయినా అప్పులు తీరలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది వ్యవసాయభూమి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రేణవ్వ, ముగ్గురు కుతుళ్లు ఉన్నారు. రేణవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి..

కామారెడ్డిటౌన్: కామారెడ్డిలోని రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావునాయక్ సోమవారం తెలిపారు. అమరావతి నుంచి తిరుపతి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ కింద పడి సుమారు 45 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. సదరు వ్యక్తి మైనార్టీ వర్గానికి చెందిన వాడని, లైట్ బ్లూ కలర్ కుర్తా, క్రీమ్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మంజుల మృతదేహం

రెంజల్: మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన మంజుల(32) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మంజుల భర్త వేధింపులు తట్టుకోలేక ఇంట్లో ఉరి వేసుకుందని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న మంజుల పుట్టింటి వారు తరలివచ్చి భర్త కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. తమ కూతురుని హత్య చేశారని ఆరోపించారు. ఈ మేరకు భర్త సంజీవ్, కుటుంబ సభ్యులపై మంజుల తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.